క్లుప్తంగా

నేడు సెమీ క్రిస్మస్ వేడుకలు

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో సాయంత్రం 6గంటలకు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ పాస్టర్ల సంఘం అధ్యక్షుడు కె.సుందరరాజు తెలిపారు. ఈ వేడుకల్లో నియోజకవర్గంలో ఉన్న పాస్టర్లు పాల్గొనాలని కోరారు.

న్యూసెన్స్ కేసు నమోదు



న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తితో మాట్లాడుతున్న పోలీసులు

దర్శి: మద్యం సేవించి వాహనాన్ని అడ్డు పెట్టి ట్రాఫిక్ అంతరాయం కలిగించిన కారణంగా ఎస్సై మురళి న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. ఉలవ సురేష్ అనే వ్యక్తి మద్యం సేవించి కారును రోడ్డుపై ఆపాడు. దీంతె వెనుక వచ్చే వాహనాలు వెళ్లే దారిలేక ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ట్రాఫిక్ నిలిచి పోయింది. దీంతో ఎస్సై అక్కడకు వచ్చి వాహనం తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మద్యం సేవించి వాహనం అడ్డు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించి నందుకు సురేష్ పై న్యూసెన్స్‌కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మద్యం మత్తులో సురేష్ పోలీసులపై కూడా దురుసుగా ప్రవర్తించాడని, కారు తీయమన్నా తీయనని అక్కడే ఉంచి న్యూసెన్స్ చేశాడని స్థానికులు తెలిపారు.

గిద్దలూరు అటవీశాఖ నూతన యూనియన్ ఎన్నిక

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ యూనియన్ అధ్యక్షుడిగా జి.రంగారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన యూనియన్ ఎన్నికలను అటవీశాఖ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె.శశిభూషన్‌యాదవ్, జోనల్ సెక్రటరీఆర్.రవీంద్ర పర్యవేక్షించారు. యూనియన్ ఉపాధ్యక్షుడిగా షేక్ చాంద్‌బాషా, కార్యదర్శిగా ఎస్‌డీ అలీమ్‌ఫరూకీ, జాయింట్ సెక్రటరీగా ఎం.సునీల్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.అశోక్‌యాదవ్, కోశాధికారిగా డి.చేజర్లయ్య ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. అటవీశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వేతనం చెల్లించాలి

గిద్దలూరు రూరల్: మసీదుల్లో పనిచేస్తున్న మౌజన్లకు వేతనం చెల్లించాలని ముస్లీం మైనార్టీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా కోరారు. పట్టణంలోని బిలాల్ మసీదులో ఆదివారం ముస్లిం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనం లేక పోవడంతో మౌజన్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముస్లింల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముస్లిం సంఘ నాయకులు నాయబ్‌రసూల్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

హైవే పక్కన చెత్త తొలగింపు



కంభం ఎంట్రన్స్‌లో హైవే పక్కన శుభ్రం చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: మండలంలోని సోమవారిపేట సమీపంలోని ఉప్పువాగు, చీతిరాల కతువ వద్ద, కంభం ఎంట్రన్స్‌లో తోకపల్లె–కడప నేషనల్ హైవేపై పక్కన చెత్త వేస్తుండటంపై ఈనెల 4వ తేదీన 'డంపింగ్ హైవే' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి హైవే అధికారులు స్పందించారు. పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు చెత్తను పడేస్తున్న మూడు ప్రాంతాలను యంత్రాలతో శుభ్రం చేయించారు. 'ఇచ్చట చెత్త వేయరాదు' అని బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రయాణం ప్రహసనం

- బస్సు సౌకర్యం లేక గ్రామీణుల పాట్లు
- ఆటోల్లో తిరుగుతూ ప్రమాదాలకు గురవుతున్న జనం
- మండలవాసులకు తప్పని తిప్పలు

దొనకొండ: పొదిలి నుంచి వయా దొనకొండ, చందవరం, త్రిపురాంతకం ఆర్‌టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో పొదిలి నుంచి త్రిపురాంతకం బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేక పోవటంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పలేదు. మండల ప్రజలు దొనకొండ రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలో ప్రయాణం ప్రమాదాలకు గురవతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేంద్రం పొదిలి నుంచి త్రిపురాంతకానికి మార్చారు. దొనకొండ, ఇతర గ్రామాల ప్రజలు ఆయన దగ్గరకు పని మీద వెళ్ళాలంటే బస్సు లేక ఇబ్బంది పడుతున్నారు. ఆటో ప్రయాణాలు ఎన్నో సార్లు ప్రమాదాలకు గురయ్యాయి. అంతేకాకుండా విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలంటే ఆటోలు ఆశ్రయించక తప్పలేదు. ఎన్నిసార్లు పొదిలి డిపో వారికి వినతి పత్రం అందజేసినా ప్రయోజనం లేకుండా పోయింది. 3 నెలలకు ఒకసారి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో ఆర్‌టీసీ సంస్థ వారు హాజరవుతున్నారు. ఎన్నోసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులు అడిగినా సరే అంటున్నారు.. కానీ మరుసటి రోజు నుంచి పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రజలను, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ప్రయాణికులకు సేవలు అందిస్తున్న బస్సు

చందవరం నుంచి నిత్యం త్రిపురాంతకం వెళ్తుంటారు



మా గ్రామం నుంచి ప్రతి నిత్యం రైతులు త్రిపురాంతకం వెళ్ళి వస్తుంటారు. వ్యవసాయ పనుల మీద ఎరువులు కొనుగోలుకు ప్రజలు ఆటోలను ఆశ్రయించక తప్పటం లేదు. రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రయాణం నరక యాతనగా ఉంది. పొదిలి డిపో వారు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఎగ్గోని క్రిష్టారెడ్డి, చందవరం

దొనకొండకు వెళ్లాలంటే కష్టం




చందవరం గ్రామం నుంచి దొనకొండ మండల కేంద్రానికి ప్రతి రోజూ పనుల నిమిత్తం ప్రజలంతా వెళుతుంటారు. గతంలో దొనకొండ నుంచి త్రిపురాంతకం బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేక పోవటంతో ఆటోలు ఆశ్రయించక తప్పటం లేదు.

– బందారు రాజు, చందవరం

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

- డిసెంబర్ 14 న జాతీయ లోక్ అదాలత్

పుల్లలచెరువు: న్యాయ స్థానాల్లో కొనసాగుతున్న రాజీకి అవకాశం కల్గిన కేసులను ఇరువర్గాల మధ్య రాజీ రూపంలో పరిష్కరించేందుకు ఈ నెల 14వ తేదీన మార్కాపురం కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు పుల్లలచెరువు ఎస్‌ఐ సంపత్‌కుఆమర్ కోరారు. జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమానికి పోలీసులు, న్యాయవాదుల తోడ్పాటుతో విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారని లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం మాట్లాడుతూ పరిష్కారానికి అవకాశం ఉన్న కాంపౌండబుల్ కేసులు––కొట్లాటలు, జూదం, రోడ్డు ప్రమాదంలో స్వల్పగాయాలు, ర్యాష్ డ్రైవింగ్, జగడాలు, భార్యాభర్తల తగవులు, బహిరంగ ప్రదేశంలో మద్యపానం, భూవివాదాలు, సివిల్ వివాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాదాలు, న్యూసెన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు వచ్చాయని చెప్పారు. డబ్బు సమయం ఆదా అవుతుంది కోర్టులో ఉన్న కాంపౌండబుల్ కేసులను సులువుగా పరిష్కరించుకోవడానికి ఈ ఆదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కక్షలు విడనాడి సామరస్య ధోరణి అవలంబించినట్లుయితే కేసుల నుంచి విముక్తి లభించి ఉపశమనం కలుగుతుందని అన్నారు. సంబంధిత వర్గాలు ఈ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో రాజీకి అనువైన కేసులను విచారణ చేసి ఇరువర్గాలకు సమాచారం ఇస్తున్నామని. కేసుల భారాన్ని తగ్గించేందుకు ఉభయవర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు నచ్చ చెబుతున్నామని చెప్పారు. ఆయా కేసుల్లో ఉన్న కక్షిదారులు చర్చించుకుని వీటి నుంచి బయటపడేందుకు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి. సంబంధిత క్రిమినల్ కేసులతో పాటు, సివిల్ కేసులను సైతం పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాం.



పుల్లలచెరువు ఎస్‌ఐ సంపత్‌కుమార్

ఆలయాల్లో విశేష పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలో గుండంచర్ల పంచాయితీలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవాని, శ్రీ వేనూతల కాటమరాజుస్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్. కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేశారు. గంగాభవాని దేవత, కాటమరాజుస్వామి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు భక్తులు సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకారంలో వేనూతల కాటమరాజుస్వామి

కొండెక్కిన గుడ్డు ధరలు



విక్రయానికి ఉంచిన కోడిగుడ్లు

పుల్లలచెరువు: ఒక పక్క మార్కెట్‌లో కూరగాయలు, నిత్యావసర సరుకు పెరిగి వినియోగదారులు ఇబ్బందులు పడుతుంటే మరో పక్క కోడి గుడ్డు ధరలు కూడా పెరిగాయి. మార్కెట్ లో ప్రస్తుతం గుడ్డు ధర ఒకటి రూ. 8 గా ఉంది. గతంలో పోలిస్తే ప్రస్తుతం ధరలు బాగా పెరిగిపోయాయి. గతంలో ఇంత ధరలు ఎప్పడు చూడలేదని వినియోగదారులంటున్నారు. ఇదేంటని నిర్వాహకులను అడిగితే గతంలో కోళ్ల మేత గా వినియోగించే మొక్కజొన్న టన్ను రూ. 22 వేల నుంచి రూ. 24 వేలు, నూకలు రూ. 18వేల నుంచి రూ. 22 వేల చొప్పన పెరిగాయని తెలిపారు. మొత్తం మేతల టన్ను రూ. 26వేల వరకు గణనీయంగా పెరిగిపోవడంతో గడ్డు ధరలు పెంచాల్సి వస్తోందంటున్నారు. ఆగస్టులో 5.7, సెప్టంబర్ లో 6.24, అక్టోబర్‌లో 6.28, నవంబర్‌లో 6.50 ఉండగా డిసెంబర్‌లో దుకాణదారులకు రూ. 7 కు విక్రయిస్తుండటంతో రిటైల్ దారులు రూ.8 లకు విక్రయిస్తున్నారు. చలి కాలంలో రోగనిరోధకశక్తి పెంపు కోసం గుడ్డును వాడుదామనుకుంటే.. అన్ని ధరలతో సమానంగా గుడ్డు ధరలు పెరగడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

ఘనంగా గుంటి గంగాభవాని పూజలు



అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం సోమవర్పపాడు పంచాయతీ పరిధిలో వేంచేసిన గుంటిగంగ భవాని అమ్మవారికి, మల్లికార్జున స్వామి, నాగమ్మతల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, కామేశ్వరశర్మ, బాలరాజులు స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించారు. టెంకాయలు కొట్టి, ఆలయ ఆవరణంలో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ పి. కార్తీక్, ప్రసాదురావు, ఆలయ చైర్మన్ కె. గురుబ్రహ్మం వసతులు సమకూర్చారు.

34 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంను రెవిన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దుదేకుల కాశింవలి ఇంటిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయని స్థానికులు సమాచారం తెలియజేయడంతో ఆయన ఇంటిలో తనిఖీలు నిర్వహించగా 59 ప్లాస్టిక్ బస్తాలు పీడీఎస్ బియ్యంగా గుర్తించామని, కాశింవలి ఇంటికి ఎదురుగా ఉన్న మరో ఇంటిని కూడా తనిఖీలు చేయగా 16 ప్లాస్టిక్ బస్తాలు పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. రెండు చోట్ల కలిపి మొత్తం 34 క్వింటాళ బియ్యాన్ని సీజ్ చేసి స్థానిక చౌక ధరల దుకాణం డీలర్‌కు భద్రత నిమిత్తం అప్పగించామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహింఖలీల్, ఆర్ఐ గోపి, వీఆర్వో గురవయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.



గుండంచర్లలో స్వాధీనం చేసుకున్న సరుకుతో రెవెన్యూ అధికారులు

ప్రకృతి వ్యవసాయంతో పంటలకు మేలు

పెద్దారవీడు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని ఇంటిగ్రేడ్ కమ్యూనిటీ రిపోర్స్ పర్సన్‌లు (ఐసీఆర్పీ)లు లాలాకృష్ణ, కాశిరామిరెడ్డిలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నాచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో శనివారం పెద్దారవీడు గ్రామానికి చెందిన అల్లు వెంకటేశ్వరెడ్డి బత్తాయి మొక్కలు ఎదుగుదలకు ద్రవ జీవామృతం తయారు చేయూ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి కషాయంతో తెగుళ్లు, పురుగులు నివారించవచ్చని, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బత్తాయి మొక్కలు ఎదుగుదలకు ద్రవ జీవామృతం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మొక్కలలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, సూక్ష్మజీవులు భూమికి అందించి వాటి జీవము, వానపాముల అభివృద్ధి చెందుతుందన్నారు. రైతన్నల జీవితాలలో వెలుగులు నింపడానికి ప్రకృతి వ్యవసాయం ఒక చక్కటి మార్గమని తెలిపారు. ద్రవ జీవామృతం వలన భూమిలోని సూక్ష్మ పోషకాలు, సోల పోషకాలు లబిస్తున్నాయని, భూమి గుల్ల భారీ వర్షపు నీరు వినకటం, వానపాములు అభివృద్ధి చెందటం జరుగుతుందన్నారు. తయారు చేసుకున్న పదార్థాలు ఆవుపేడ, బెల్లం, పుట్టమట్టి, శనగపిండి ఒకటి తర్వాత మరోటి డ్రమ్ములో ఉన్న నీటిలో వేయాలి. చివరిగా ఆవు మూత్రం పోస్తూ అన్ని పదార్థాలు మిశ్రమం అయ్యేలా కర్రతో సవ్యదిశలో కలపాలి. అనంతరం డ్రమ్ముపై పట్ట కట్టి నీడలో ఉంచాలి. 7, 8 రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం , సాయంత్రం రెండు సార్లు కర్రతో సవిదశలో తిప్పాల్సి ఉంటుంది. 8 రోజుల తర్వాత తయారైన ద్రవ జీవామృతాన్ని బత్తాయి చెట్లకు పిచికారి చేసుకోవాలని, 10 రోజులు కంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు.



డ్రమ్ములో పదార్థాలు మిశ్రమం చేస్తున్న రైతు వెంకటేశ్వర రెడ్డి

కోడి పందెం నిర్వాహకుల అరెస్ట్



అరెస్టు అయిన కోడి పందెం నిర్వాహకులు



అరెస్టు చేసిన మట్కా జూదరులు

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ నారపురెడ్డిపల్లి పొలాల్లో కోడి పందెం జూదరులను అరెస్టు చేశారు. ఎస్ఐ కె.విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. నారపురెడ్డిపల్లి పొలాల్లో నలుగురు ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్నారు. దీంతో వారిని అరెస్టు చేసి రెండు కోళ్ళు, రూ.8500 నగదు, 4 సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని దర్శి సబ్ కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్కా జూదరులు..

స్థానిక రైల్వే ట్రాక్ సమీపంలో చెట్ల కింద మట్కా ఆడుతున్న ముగ్గురుని ఎస్ఐ తమ సిబ్బందితో వెళ్ళి అరెస్టు చేశారు. వారి వద్ద రూ.2,430 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమరనాథ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.







సీసీ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



ట్యాంకు సమీపంలో నిలిచిన మురుగు

'ఛీ ఛీ' రోడ్లు!

అర్ధవీడు: మండలంలో పాపినేనిపల్లి పంచాయతీ అంకభూపాలెం గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి మురుగుమయంగా మారాయి. గ్రామస్తులు రోడ్డుపై నడిచేందుకు కూడా అవకాశం లేదు. సీసీ రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించకపోవడంతో వర్షం నీటితోపాటు ఇళ్ల నుంచి వచ్చే మురుగు కలిసిపోయి దుర్వాసన వస్తోంది. దోమల బెడద అధికంగా ఉండటంతో జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శునక సేన.. జనం హైరానా!

కంభం/మార్కాపురం: వీధి శునకాలు జనానికి దడ పుట్టిస్తున్నాయి. శునకాల గుంపు పక్కగా నడుచుకుంటూ వెళ్తున్నా, బైక్‌పై ప్రయాణిస్తున్నా వెంటాడి మరీ రెక్కేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురం పరిధిలో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నా పంచాయతీ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కంభం, కందులాపురం, హజరత్ గూడెం గ్రామపంచాయతీలు మూడు కలిసిపోయి ఉంటాయి. గతంలో కంభం పంచాయతీ పరిధిలో పంచాయతీ అధికారులు సుమారు 400 వరకు కుక్కలను పట్టించి అటవీ ప్రాంతానికి తరలించారు. కందులాపురం, హజరత్‌గూడెం పంచాయతీ పరిధిలో కుక్కలను పట్టించలేదు. దీంతో కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ దొరకడంలేదు. ఈ మూడు పంచాయతీల్లో నిత్యం ఒకరిద్దరు కుక్కకాటుకు గురై ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్సపొందుతున్నారు. ఇటీవల కాలంలో చిన్నపిల్లలు, పాదచారులు కుక్కకాటు బారిన పడటం అధికమైంది. రాత్రి పూట రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి వెళ్లే ప్రయాణికులను శునకాలు వెంబడిస్తున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ ఆటోలను సైతం వెంటాడుతున్నాయి. ఇక పాదచారుల అవస్థలు చెప్పనక్కర్లేదు. ఒక్కరే రాత్రి పూట నడిచి వెళ్లాలంటే హడలిపోతున్నారు.



నెహ్రూనగర్‌లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

మార్కాపురంలో కుక్కల బెడద

మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వీటికి కోతులు కూడా తోడయ్యాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న శివాజీనగర్‌లో పలు వీధుల్లో కుక్కల సంచారం ఎక్కువైంది. ఆ ప్రాంతాల్లోకి కొత్త వ్యక్తులు వెళ్తే వెంటపడి కరుస్తున్నాయి. బైక్‌పై వెళ్లే వారిని సైతం వదలడం లేదు. ఈ క్రమంలో శునకాలకు భయపడి బైక్‌పై నుంచి కిందపడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ, ఎస్టేట్, డ్రైవర్సు కాలనీ, నానాజాతుల పేట, రాజ్యలక్ష్మి కాలనీ, నాగులవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజలు కూడా రాత్రిపూట వారి ఇళ్లకు వెళ్లాలంటే భయపడుతున్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వీధి శునకాల విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి కౌన్సిలర్లు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా కోతులు ఇళ్లలోకి ప్రవేశించి సామగ్రా, తినుబండారాలు తీసుకెళ్లడంతోపాటు అడ్డువచ్చిన మనుషులపైకి దూకుతూ కరుస్తున్నాయి. కాగా గత ఏడాది కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేసినప్పటికీ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను, కోతులను రాత్రిపూట మార్కాపురం పట్టణ శివార్లలోని పలకల గనుల వద్ద వదిలివెళ్లడంతో వాటి బెడత మళ్లీ ఎక్కువైంది. ఇటీవలే పట్టణంలోని అలుగువద్ద ఓ కుక్క ఇద్దరిని కరవగా, వేములకోటలో వారం రోజుల క్రితం ఒకే కుక్క నలుగురిని కరిచింది.

త్వరలో పట్టుకుంటాం

మార్కాపురం మున్సిపాలిటీలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లు నా దృష్టికి కూడా వచ్చింది. త్వరలో వాటిని పట్టుకుని జనసంచారం లేని ప్రాంతంలో వదిలిపెడతాం. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం.

– నారాయణరావు, మున్సిపల్ కమిషనరు, మార్కాపురం

ఆవులతో వాహనదారుల అవస్థలు



జాతీయ రహదారిపై వాహనాలకు అడ్డుగా కూర్చున్న ఆవులు

కంభం: అనంతపురం–అమరావతి జాతీయ రహదారిపై ఆవులు గుంపులు గుంపులుగా కూర్చోవడం, తిరుగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సుమారు 50 వరకు ఆవులు కందులాపురం కూడలి, వైజంక్షన్, బస్టాండ్, చౌక్ సెంటర్, కూరగాయల మార్కెట్‌లో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఆవుల యజమానులు వాటిని రోడ్లపైకి వదిలేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడమే కాకుండా ఒక్కోసారి వాహనాలు ఢీకొని ప్రమాదానికి గురవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలిలో జాతీయ రహదారి మధ్యలో ఆవులు గుంపులు గుంపులుగా కూర్చుంటుండటంతో వాహనదారులు అవి పక్కకు తొలగే వరకు ఆగాల్సి వస్తోంది. రాత్రి పూట గస్తీ తిరిగే పోలీసులు నిత్యం రోడ్డుపైన కూర్చున్న ఆవులను పక్కకు తోలుతున్నారే తప్పా యజమానులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వకపోవడంపై వాహనదారులు పెదవివిరుస్తున్నారు.